క్లుప్తంగా

నేటి నుంచి శ్రీ కోట దుర్గ అమ్మవారి ఆలయ ప్రతిష్ట

మక్కువ: మండల కేంద్రం మక్కువలో సోమవారం నుంచి బుధవారం వరకు శ్రీ కోట దుర్గ అమ్మవారి ఆలయ ప్రతిష్ట మహోత్సవాలను నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. వేదపండితులు మొక్కరాల వెంకటరమణమూర్తి, ఆరవెల్లి విజయ్ కుమార శర్మ ఆధ్వర్యంలో ఆలయ ప్రతిష్ట మహోత్సవాలను ఘనంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. భక్తులందరూ ప్రతిష్ట మహోత్సవాల్లో పాల్గొని, అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించాలని కోరారు.

ఆంజనేయస్వామికి పూజలు


ఆంజనేయస్వామికి పూజలు చేస్తున్న రంగునాయుడు

మక్కువ: మండలంలోని కొండరేజేరు గ్రామంలో ఆంజనేయ స్వామికి వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు మావుడి రంగునాయుడు ఆదివారం ప్రత్యేక పూజలు జరిపించారు. గ్రామంలో ఆంజనేయ స్వామి ఆలయ ప్రారంభ కార్యక్రమాన్ని మూడు రోజులుగా ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమం ఆదివారం ముగియడంతో, రంగునాయుడు పాల్గొని, స్వామివారికి అభిషేకాలు చేశారు. గ్రామంలో ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. మండలంలోని పాపయ్యవలస, కాశీపట్నం, గ్రామాలనుంచి భక్తులు చేరుకుని స్వామివారి ప్రసాదాన్ని స్వీకరించారు.

కనులపండువగా కొత్తమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ట


అమ్మవారి విగ్రహాన్ని తీసుకువస్తున్న భక్తులు

సాలూరు: పట్టణంలో కొత్తమ్మ తల్లి అమ్మవారి విగ్రహ ప్రతిష్టా మహోత్సవం కనుల పండువగా ప్రారంభమైంది. ఈ మేరకు ఆదివారం ఉదయం పంచముఖేశ్వరస్వామి ఆలయం నుంచి అమ్మవారి విగ్రహాన్ని ఊరేగింపుగా ఆలయ ప్రాంగణానికి తీసుకువచ్చారు. అధిక సంఖ్యలో భక్తులు వచ్చి, శాస్త్రోక్తంగా అమ్మవారి విగ్రహానికి ప్రత్యేక పూజలు చేసారు. స్థానికంగా ఆధ్యాత్మికత వాతావరణం నెలకొంది.ఈ నెల 20 వరకు ఈ విగ్రహ ప్రతిష్టా మహోత్సవాలు జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు.

22న ఉచిత మెగా వైద్య శిబిరం

గరుగుబిల్లి: మండలంలోని రావుపల్లి గ్రామంలో ఈనెల 22న ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు రామ మందిర కమిటీ సభ్యులు తెలిపారు. గ్రామంలోని పెద్దవీధిలో సీతారామ మందిర పునఃప్రతిష్ట మహోత్సవంలో భాగంగా గ్రామంలోని ప్రాథమిక పాఠశాల ఆవరణలో వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. ప్రముఖ కార్డియాలజిస్ట్ డా. గుల్ల సూర్యప్రకాష్, డా.రామ్మోహనరావుతో పాటు పలువురు వైద్యులు శిబిరంలో పాల్గొని సేవలందిస్తారని తెలిపారు. పరిసర గ్రామాలకు చెందిన ప్రజలు వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పోలీసుల ఫ్లాగ్‌మార్చ్

భామిని: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో మండలంలోని పలు గ్రామాల్లో పోలీసులు ఆదివారం ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేందుకు సహకరించాలని ప్రజలను కోరారు. అలాగే ఓటర్లు స్వేచ్ఛగా తమకు నచ్చిన పార్టీకి ఓటు వేసి, ప్రజాస్వామ్య పరిరక్షణకు తోడ్పడాలన్నారు.

దుర్గమ్మకు సంబర నీరాజనం

పాలకొండ రూరల్: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం పాలకొండ కోటదుర్గమ్మకు భక్తులు సంబరాలు చేశారు. పట్టణ వాసులతో పాటు పట్టణ పరిసర గ్రామాల భక్తులు పెద్దఎత్తున మండల కేంద్రంలోని ఆలయానికి చేరుకుని, అమ్మవారికి ఘటాలు, ముర్రాటలు సమర్పించారు. అర్చకులు దార్లపూడి లక్ష్మీప్రసాదశర్మ ఆధ్వర్యంలో భక్తులు అమ్మవారికి విశేష పూజలు, అర్చనలు చేశారు. సుదూర ప్రాంతాల నుంచి కాలినడకన ఆలయానికి భక్తులు చేరుకుని మరీ మొక్కులు చెల్లించుకోవడం విశేషం. కార్యక్రమంలో భాగంగా చేపట్టిన డప్పువాయిద్యాల ప్రదర్శనలు, అమ్మవార్ల వేషధారణలు ఆకట్టుకున్నాయి.

బోర్ల మరమ్మతులు

సీతంపేట: క్రాస్‌ప్రోగ్రాంలో భాగంగా మండల వ్యాప్తంగా పాడైన బోర్లను యుద్ధప్రాతిపదికన బాగుచేసి, వినియోగంలోకి తీసుకువస్తున్నారు. దోనుబాయి, గుజ్జి తదితర మారుమూల గిరిజన ప్రాంతాల్లో కూడా ప్రత్యేక డ్రైవ్ చేపట్టి, మంచినీటి కొరత తీర్చే పనిలో సంబంధిత సిబ్బంది నిమగ్నమయ్యారు.

విజయం తథ్యం

- అలజంగి జోగారావుకు టికెట్ కేటాయింపు
- పార్వతీపురం నియోజకవర్గం ప్రజల హర్షం


పార్వతీపురం టౌన్: ఎమ్మెల్యే జోగారావుకు శుభాకాంక్షలు తెలుపుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

పార్వతీపురంటౌన్: విశ్వసనీయతకు మారుపేరుగా ఉన్న వైఎస్సార్ సీపీ తరపున పార్వతీపురం నియోజకవర్గ ఎమ్మెల్యేగా నిస్వార్థంగా ప్రజలకు సేవలందించి మంచిపేరు సంపాదించిన అలజంగి జోగారావుకు మరోమారు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా అవకాశం దక్కడం పట్ల వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, అభిమానులు, పార్టీ శ్రేయాభిలాషులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల ఆ పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సమక్షంలో ఇడుపులపాయలో విడుదల చేసిన ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థుల జాబితాల్లో మరోమారు అలజంగి జోగారావుకు ప్రజాసేవకు అవకాశం కల్పించడాన్ని నియోజకవర్గ ప్రజలు నిండు మనసుతో స్వాగతిస్తున్నారు. గతంలో అధికారం చేపట్టి నాటి నుంచి జోగారావు ప్రజా క్షేత్రానికే అంకితమయ్యారు. నియోజకవర్గంలో ఎవరికి ఏ సమస్య వచ్చినా తాను ముందుండి ధైర్యం కల్పించారు. ప్రభుత్వపరంగా బాధితులందరికీ అండగా నిలిచారు. నవరత్నాల పేరిట ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలను అర్హులకు చేరేలా చేశారని లబ్ధిదారులు పేర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో మరోదఫా జోగారావు విజయం తథ్యమని రాజకీయ విశ్లేషకులు ముక్తకంఠంతో పేర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో ఆదివారం జోగారావు మద్దతు దారులు, అభిమానులు పెద్ద ఎత్తున ఆయన స్వగృహానికి చేరుకుని పుష్పగుచ్ఛాలు అందిస్తూ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ క్రమంలో జోగారావు మాట్లాడుతూ ప్రజల అభిమానం, అధికారుల సమన్వయంతో నియోజకవర్గ అభివృద్ధి సాధ్యమైందని, మరోమారు ఆశీర్వదిస్తే మరింతగా నియోజకవర్గాన్ని పురోగతి బాటలో నడిపించేందుకు సమష్టిగా కృషి చేస్తానన్నారు.


సాలూరు రూరల్: హర్షం వ్యక్తం చేస్తున్న మండల నాయకులు

రాజన్నదొరను అత్యధిక మెజారిటీతో గెలిపిస్తాం

సాలూరు రూరల్: నియోజకవర్గ ప్రజల కోరికను మన్నించి ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి ఉపముఖ్యమంత్రి రాజన్నదొరకు మరోసారి సాలూరు ఎమ్మెల్యే టికెట్ ఇవ్వడంపై మండలంలోని మామిడిపల్లి గ్రామంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు భరత్ శ్రీనివాస్, వైఎస్సార్‌సీపీ జిల్లా సేవాదళ్ అధ్యక్షుడు సువ్వాడ రామకృష్ణ, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి దండి శ్రీనుల ఆధ్వర్యంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు సంబరాలు జరుపుకున్నారు.ఈ సందర్భంగా ఏఎంసీ చైర్‌పర్సన్ దండి అనంత కుమారి మాట్లాడుతూ ఉపముఖ్యమంత్రి రాజన్నదొర ఎంపీ టికెట్ కోసం ప్రయత్నం చేస్తుండగా ఎమ్మెల్యేగా ఉండాలని తామంతా పట్టు బట్టామని తమ కోరికను మన్నించి ఎమ్మెల్యేగా టికెట్ ఇచ్చిన జగన్‌మోహన్‌రెడ్డికి తామంతా రుణపడి ఉంటామన్నారు. మక్కుసూటి మనిషిగా, ప్రజానేతగా పేరుపొందిన రాజన్నదొరను అత్యధిక మెజారిటీతో గెలిపిస్తామని, జైజగన్ జైజై రాజన్నదొర అంటూ నినాదాలు చేశారు.


సాలూరు: రాజన్నదొరకు ఎమ్మెల్యే టికెట్ కేటాయించడంతో పట్టణంలో సంబరాలు చేసుకుంటున్న వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు

పాంచ్ పటాకా ఖాయం

ఉపముఖ్యమంత్రి, గిరిజన సంక్షేమ శాఖామంత్రి పీడిక రాజన్నదొర వరుసగా 5వ సారి అసెంబ్లీలోకి అడుగుపెట్టడం ఖాయమని జిల్లా గ్రంథాలయాల సంస్థ చైర్‌పర్సన్ రెడ్డి పద్మావతి, సాలూరు వైస్‌ఎంపీపీ రెడ్డి సురేష్‌లు అన్నారు. ఈ మేరకు రాజన్నదొరకు సాలూరు ఎమ్మెల్యే టికెట్ కేటాయించినందుకు ముఖ్యమంత్రి వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డికి, వైఎస్సార్‌సీపీ అధిష్టానానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. రాజన్నదొరను అఖండ మెజారిటీతో గెలిపించేందుకు తామంతా సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు.

ఎన్నికల నిబంధనలు విధిగా పాటించాలి

- ఆర్డీఓ కె.హేమలత

సీతానగరం: పార్వతీపురం నియోజకవర్గంలో సహాయ ఎన్నికల అధికారులు, స్థానిక పర్యవేక్షకులు, ఎన్నికల నియమావళిని విధిగా పాటించాలని ఆర్డీఓ కె హేమలత కోరారు. ఈ మేరకు ఆదివారం ఆమె సీతానగరం మండలంలోని చినభోగిలి, సీతానగరం, పెదభోగిలి పోలింగ్ కేంద్రాలను, ప్రధారోడ్లకు ఇరువైపులా బ్యానర్లు, ఫొటోలు, వాల్‌పోస్టర్లను పరిశీలించారు.అనంతరం సీతానగరం మార్కెట్, పురవీధుల్లో రాజకీయ పార్టీల జెండాలు, నాయకుల ఫోటోలు, బ్యానర్లు తక్షణమే తొలగించాలని ఆదేశించారు. విగ్రహాలకు ముఖాలు కన్పించకుండా వస్త్రాలు కట్టాలని సూచించారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున మే నెలలో సార్వత్రిక ఎన్నికలు నిర్వహించేంత వరకు పట్టణాలు, గ్రామాల్లో అందరూ ఎన్నికల నియమాలను పాటించాలని, ఎన్నికల అధికారుల అనుమతి తీసుకోవలసి ఉంటుందని స్పష్టం చేశారు. ప్రైవేట్ స్థలాలు, ఇళ్లపై రాజకీయ పార్టీల జెండాలు ఉన్నట్లయితే సంబంధిత స్థలయజమాని నుంచి ముందుగా అనుమతి పొందాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ అడబాల శ్రీనివాసరావు, ఎంపీడీఓ ఎం.ఈశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి జె.వెంకటరావు, వీఆర్‌ఓ పైల కుమారస్వామి, సింహాచలం, వీఆర్‌ఏలు పాల్గొన్నారు.


మార్కెట్‌లో జెండాలను తీయిస్తున్న ఆర్డీఓ కె.హేమలత

చెముడులో జగనన్న ఇంటి గృహప్రవేశం

మక్కువ: మండలంలోని చెముడు గ్రామంలో ఓ లబ్ధిదారు జగనన్న ఇంటి గృహప్రవేశం ఆదివారం జరుపుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు మావుడి రంగునాయుడు హాజరయ్యారు. ఈ సందర్భంగా రంగునాయుడు మాట్లాడుతూ ఎంతోమంది పక్కా ఇల్లు లేని నిరుపేదలకు, ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఇంటి స్థలంతో పాటు, ఇల్లును నిర్మించి నీడను కల్పించారన్నారు. ప్రతి పేదవాడికి సొంతిల్లు ఒక కల అని, అటువంటి కలను నిజం చేసిన మహా నాయకుడు సీఎం జగన్ అని ప్రశంసించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.


చెముడులో గృహప్రవేశం కార్యక్రమంలో పాల్గొన్న రంగునాయుడు

ఘనంగా సిర్లి ఎల్లారమ్మ జాతర

సీతానగరం: మండలంలోని అంటిపేట, సీతానగరం గ్రామాల్లో సిర్లి ఎల్లారమ్మకు ఆదివారం వేలాది మంది భక్తులు భక్తిశ్రద్ధలతో మొక్కులు తీర్చుకున్నారు. మండల కేంద్రంలోని దేవాంగుల వీధిలో సిర్లి ఎల్లారమ్మను దర్శించుకుని మొక్కులు తీర్చుకునేందుకు భక్తులు చేపలు, గుడ్లు, వివిధ రకాల పండ్లు, ఉలవలు, పసుపు కుంకుమ, చలివిడి, చీరలు బ్లౌజ్ పీస్‌లు గాజులతో గుడికి వచ్చారు. పూజా సామగ్రితో పాటు వాటిని భక్తులు అమ్మవారికి సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఉత్సవకమిటీ అధ్యక్షుడు, కార్యదర్శి, సీహెచ్ గోపాలకృష్ణ, కన్నారావుల ఆధ్వర్యంలో భక్తులు అమ్మవారిని దర్శించుకునేందుకు సదుపాయాలు కల్పించారు. అమ్మవారిని దర్శించుకునేందుకు మండలంలోని ప్రజలే కాకుండా వివిధమండలాలనుంచి భక్తులు వచ్చి పూజలు చేశారు. జాతరలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్సై ఎం.రాజేష్ ఆధ్వర్యంలో సిబ్బంది బందోబస్తు నిర్వహించారు. ఏర్పాటు చేశారు. అంటిపేటలో ఎస్సీకాలనీలో జరిగిన జాతరలో డీసీసీబీ డైరెక్టర్ కృష్ణంనాయుడు, సర్పంచ్ గొట్టాపు తిరుపతిరావు, బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ ఎస్.తిరుపతిరావు, ఎంపీటీసీ ఎస్.నిర్మల, భక్తులు అమ్మవారిని దర్శించి భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు.


సీతానగరం: సిర్లి ఎల్లారమ్మ జాతరలో పాల్గొన్న భక్తులు

వాసవీ క్లబ్ ప్రతినిధుల మజ్జిగ పంపిణీ

సీతానగరం: సిర్లి ఎల్లారమ్మ జాతరను పురస్కరించుకుని ఆదివారం మధ్యాహ్నం వాసవీక్లబ్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు చేపట్టినట్లు వాసవీ క్లబ్ మండల శాఖ అధ్యక్షుడు ఎ.గోవిందరావు, జోనల్ ప్రతినిధి ఏవీ సత్యనారాయణ, ఆర్యవైశ్య సేవాసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.విశ్వేశ్వరరావు తెలిపారు. ఈ మేరకు రోడ్డుపై రాకపోకలు నిర్వహించే వాహన చోదకులు, పాదచారులకు 150 లీటర్ల మజ్జిగ పంపిణీ చేశామన్నారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సేవాసంఘం సభ్యులు కె.లక్ష్మణరావు, శ్రీనివాసరావు, సేవాసంఘం సభ్యులు పైడినాయుడు, వెంకటరమణ, అప్పలనాయుడు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.


పార్వతీపురం టౌన్: సిరుల ఎల్లమ్మ పుట్ట వద్ద పూజలు చేస్తున్న అర్చకులు

పార్వతీపురంలో..

పార్వతీపురం టౌన్: భక్తుల కోర్కెలు తీర్చే సిరుల ఎల్లారమ్మ యాత్రకు ఆదివారం భక్తులు పోటెత్తారు. ఈ జాతరతో పార్వతీపురం పట్టణంలోని సిర్లిపోతన్నవీధి జనసంద్రమైంది. భక్తులు అమ్మవారికి జోగి సమర్పించారు. తమ పిల్లల భవిష్యత్తు చక్కగా ఉండాలని వేడుకుంటూ మొక్కులు చెల్లించుకున్నారు. పాలజంగిడి, సిందూర కుండ దర్శనం కోసం భక్తులు బారులు తీరారు. తెల్లవారుజాము నుంచి ప్రజలు ఆలయానికి చేరుకుంటుండడంతో ఆ ప్రాంతమంతా ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. భక్తుల సౌకర్యార్థం నిర్వాహకులు వసతులు కల్పించారు. ఎటువంటి అవాంఛనీయ ఘటనలు సంభవించకుండా ఆలయ కమిటీ నిర్వాహకుల సమన్వయంతో పట్టణ పోలీసు సిబ్బంది బందోబస్తు చర్యలు చేపట్టారు.

వైఎస్సార్‌సీపీదే మళ్లీ విజయం

- ఎమ్మెల్యే అలజంగి జోగారావు

పార్వతీపురంటౌన్: వచ్చే సాధారణ ఎన్నికల్లో విజయం మళ్లీ వైఎస్సార్‌సీపీదేనని ఎమ్మెల్యే జోగారావు అన్నారు. ఈ మేరకు పార్వతీపురం నియోజకవర్గం వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా రెండవసారి పార్టీ టికెట్ తనకు ఖరారైన అనంతరం ఆదివారం చేపట్టిన ఎన్నికల ప్రచారంలో భాగంగా పెదబొండపల్లి గ్రామాన్ని ఎమ్మెల్యే జోగారావు ఆదివారం సందర్శించారు. రెండవసారి ఎమ్మెల్యే టికెట్ దక్కించుకుని మొట్టమొదటిసారి తమ గ్రామానికి విచ్చేసిన ఎమ్మెల్యేకు గ్రామ ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు ఘనంగా స్వాగతం పలికి, హారతులు పట్టి, విజయ కుంకుమ దిద్ది మళ్లీ వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయఢంకా మోగించడం ఖాయమని ఆశీర్వదించారు. మళ్లీ జగనన్న ప్రభుత్వంలో ఎమ్మెల్యేగా జోగారావు విజయం సాధిస్తారని, పెద్దఎత్తున నినాదాలు చేస్తూ ఎమ్మెల్యేకు, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి తమ పూర్తి మద్దతు తెలియజేస్తూ భారీ ఎత్తున ర్యాలీ నిర్వహించి స్వాగతం పలికారు. అనంతరం ఎమ్మెల్యే అందరికీ కృతజ్ఞతలు తెలియజేస్తూ తనపై నమ్మకం ఉంచి పార్వతీపురం ఎమ్మెల్యే అభ్యర్థిగా మళ్లీ తనకు సీటు కేటాయించడంతో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేస్తూ మీరంతా జగన్ మనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి తనను అఖండ మెజారిటీతో గెలిపించడమే కాకుండా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి బహుమతిగా ఇచ్చి, ఆయనను ముఖ్యమంత్రి చేసుకునే బాధ్యత మన అందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ సవరాపు తవుడమ్మ రాజారావు, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు చందక శివాజీ, మువ్వల సత్యంనాయుడు, పోల సత్యనారాయణ, ఏఎంసీ డైరెక్టర్ అల్లం వెంకట్రావు, నాయకులు వంగపండు కృష్ణమూర్తి, వంగపండు శ్రీరాములు నాయుడు, మాజీ పీఏసీఎస్ చైర్మన్ గుంట్రెడ్డి దామోదర్‌రావు, స్కూల్ కమిటీ చైర్మన్ పప్పల శ్రీనివాసరావు, పోలింగ్ బూత్ సభ్యులు స్థానిక నాయకులు, కార్యకర్తలు, ప్రజలు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.


ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న ఎమ్మెల్యే జోగారావు

పక్కాగా ఎన్నికల కోడ్ అమలుచేయాలి

- కలెక్టర్ నిశాంత్‌కుమార్

పాలకొండ: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల కోడ్ పక్కాగా అమలుచేయాలని కలెక్టర్ నిశాంత్‌కుమార్ ఆదేశించారు. స్థానిక పట్టణంలో ఆదివారం సాయంత్రం పర్యటించిన ఆయన ఎన్నికల కోడ్ అమలుతున్నదీ లేనిదీ పరిశీలించారు. వీరఘట్టం సెంటర్ నుంచి శ్రీకాకుళం రోడ్డులోని ఆర్‌డీవో కార్యాలయం వరకు కాలినడకన వెళ్లిన ఆయన రోడ్డుకు ఇరువైపులా రాజకీయ బ్యానర్లు, పోస్టర్లు, హోర్డింగులు చూసి, అధికారులకు పలు సూచనలు చేశారు. కోడ్ అమలుపై పూర్తి అవగాహన పెంచుకోవాలని, ఎటువంటి సమస్యలు ఉన్నా తన దృష్టికి తీసుకురావాలని ఆర్‌డీవో వెంకటరమణకు తెలిపారు. ఎన్నికల సిబ్బందికి తగిన సూచనలు ఇవ్వాలని నగరపంచాయతీ కమిషనర్ సర్వేశ్వరరావుకు చెప్పారు.

పాలకొండ: ఎన్నికల నియమావళి అమలుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని నగరపంచాయతీ కమిషనర్ ఎస్.సర్వేశ్వరరావు అన్నారు. స్థానిక పట్టణంలోని పలు వీధుల్లో ఉన్న రాజకీయ హోర్డింగులు, ప్రచార బోర్డులను ఆదివారం తొలగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చినందున ఎక్కడా పార్టీ ప్రచార బ్యానర్లు, హోర్డింగులు ఉండకూడదన్న ఉద్దేశ్యంతో వాటిని తొలగించడం జరుగుతోందన్నారు. తమ అనుమతులు లేకుండా ఎక్కడా ఎటువంటి బోర్డులు ఏర్పాటు చేయకూడదన్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లో కూడా రాజకీయ నాయకుల ఫొటోలను తొలగించాలని సూచించారు.


పాలకొండ పట్టణ ప్రధాన రోడ్డులో పర్యటిస్తున్న కలెక్టర్ నిశాంత్‌కుమార్

భామిని: ఎన్నికల కోడ్ అమలులో భాగంగా మండల వ్యాప్తంగా రాజకీయ నాయకుల ఫొటోలతో కూడిన బ్యానర్లు, ఫ్లెక్సీలు, హోర్డింగ్‌లు ఆదివారం తొలగించారు. నేరడి–బి సచివాలయం పరిధిలో కార్యదర్శి లోవ అనసూయ ఆధ్వర్యంలో రాజకీయ పోస్టర్లు, స్టిక్కర్లు తొలగించారు. కొన్ని జంక్షన్లు, ప్రధాన కూడళ్లలోని రాజకీయ నాయకుల విగ్రహాలకు ముసుగులు కూడా వేశారు.

కోడ్ కూసింది..ముసుగు పడింది


ఎన్‌టీఆర్ విగ్రహానికి వేసిన ముసుగు


రాజీవ్‌గాంధీ విగ్రహానికి వేసిన ముసుగు


పట్టణంలో వైఎస్సార్ విగ్రహానికి వేసిన ముసుగు

సాలూరు: ఎన్నికల కోడ్ రావడంతో నియోజకవర్గంలో అధికారులు అప్రమత్తమయ్యారు. ఈ మేరకు పట్టణం, మండలాల్లో వివిధ పార్టీల హోర్డింగ్‌ల తొలగింపు, విగ్రహాలకు ముసుగులు వేయడం తదితర కార్యక్రమాలు చేపట్టారు. ఎన్నికల కోడ్ ముగిసే వరకు అందరూ ఎన్నికల ప్రవర్తనా నియమావళిని పాటించాలని అధికారులు స్పష్టం చేశారు.

బాధ్యతల స్వీకరణ

పాలకొండ: ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా బి.రేణుక ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. కొమరాడ ప్రభుత్వ జూనియర్ కళాశాల నుంచి బదిలీపై ఆమె ఇక్కడికి రాగా కళాశాల అధ్యాపకులు, సిబ్బంది ఆమెను కలిసి, అభినందనలు తెలిపారు.

ఘనంగా సిర్లు యాత్ర

వీరఘట్టం: మండల కేంద్రంలోని సాయినగర్ సమీపంలో సిర్లు యాత్ర ఆదివారం ఘనంగా నిర్వహించారు. పట్టణ ప్రజలతో పాటు పరిసర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో తరలివచ్చిన భక్తులు యజ్ఞకర్త ఎస్.వి.ఎల్.ఎన్. శర్మయాజి ఆధ్వర్యంలో అక్కడి సిర్లు పోతన్న, ఎల్లమ్మలకు ప్రత్యేక పూజలు చేసి, మొక్కులు చెల్లించుకున్నారు. ఆదివారం నుంచి మంగళవారం వరకు జరగనున్న ఈ యాత్ర మూడో రోజుకు భక్తుల రద్దీ పెరిగే అవకాశం ఉందని ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. దైవ దర్శనానికి వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేసినట్లు వెల్లడించారు.

భామిని: మండలంలోని నేరడి–బి గ్రామంలో సిరులు ఎల్లమ్మ యాత్ర ఆదివారం వైభవంగా జరిగింది. గ్రామస్తులతో పాటు చుట్టుపక్కల ప్రాంతాల నుంచి పెద్దసంఖ్యలో భక్తులు తరలివచ్చి, అమ్మవారికి జోగి సమర్పించి, మొక్కులు చెల్లించుకున్నారు.

ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిపించడమే లక్ష్యం

వీరఘట్టం: ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిపించడమే తమ లక్ష్యమని పాలకొండ డీఎస్పీ జి.వి.కృష్ణారావు అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా మే 13వ తేదీన సార్వత్రిక ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఆయన ఆదివారం సాక్షి విలేకరులతో ముచ్చటించారు. పోలింగ్ సమయంలో ఎక్కడా అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా అన్ని విధాలా చర్యలు చేపడుతున్నామన్నారు. సమస్యాత్మక, అతి సమస్యాత్మక గ్రామాలను ఇప్పటికే గుర్తించి, నిఘా ఉంచామన్నారు. ఎవరైనా అలజడులు సృష్టించాలని చూస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఓటర్లు కూడా ఎన్నికల ప్రలోభాలకు లొంగకుండా స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. పాలకొండ డివిజన్ పరిధిలో కురుపాం, పాలకొండ నియోజకవర్గాలు ఉండగా, పాలకొండ నియోజకవర్గంలోని 1,93,667 మంది ఓటర్లు.. 287 పోలింగ్ కేంద్రాల్లో, కురుపాం నియోజకవర్గంలోని 1,92,636 మంది ఓటర్లు.. 208 పోలింగ్ కేంద్రాల్లో ఓటు వేయనున్నారన్నారు. ఆయా నియోజకవర్గాల్లో మొత్తం 31 సమస్యాత్మక, 12 అతి సమస్యాత్మక గ్రామాలు ఉన్నాయన్నారు. ఎన్నికల వేళ గ్రామాల్లో శాంతిభద్రతలు కాపాడేందుకు బైండోవర్ కేసులు కూడా నమోదు చేయడం జరుగుతోందన్నారు. చెక్‌పోస్ట్‌ల వద్ద వాహన తనిఖీలు ముమ్మరం చేసినట్టు చెప్పారు.